




ఎక్కవలిసిన రైలు తప్పిపోవడంతో, దీపావళి వెళ్ళిపోయిన రెండో రోజుకు సంధ్యాసమయాన ఆ ఊరు చేరుకొని, చేరవలిసిన ఇంటిని వెతుక్కొంటూ వచ్చి ఒక ఇంటిముందు నిలబడ్డాడు జయకృష్ణ.

ఇంటింటా వెలుగు నింపి, మొన్ననే వెళ్ళిపోయిన దీపావళిని ఇంకా మరిచిపోలేదన్నట్లుగా ఆ ఇంటా, ఈ ఇంటా వాకిట్లలో దీపాలు పెడుతున్న వాళ్లను చూస్తూ నిలబడ్డ జయకృష్ణ మనస్సు తీయని ఊహలతో ఊయల లూగుతూంది.

ఆ ఇంటి తలుపు తెరుచుకొని ఒకామె వెలుగుతున్న దీపాలున్న పళ్ళెం పట్టుకుని బయటికి వచ్చింది. ఆమె కొంగుచాటున ఓ పసిపాప.

జయకృష్ణ ఆమెను చూశాడు. మనసు ఉద్వేగ పూరితమైంది. మాటలు పైకి రాలేదు. 'బృందా . . . బృందా. . .' అని అతడి మనస్సు అనుకొంటూంది.

ఇంటి అరుగుమీద దీపాలుపెట్టి, పాపకు ఏదో చెబుతున్న ఆమెను చూస్తుంటే. . . 'ఒకప్పుడు ఎంతో పెద్దదానిలా నాకూ ఇలాగే చెప్పేదానివి,బృందా...' అనుకొన్నాడు జయకృష్ణ.

పాప కాకరపువ్వొత్తులు వెలిగించింది.

ఆ వెలుగు పువ్వుల్లో ఆమెను చూస్తూ ముందుకు వచ్చాడు జయకృష .

ఆమె అతన్ని చూసి తమ ఇంటికే కాబోలు అనుకొని "ఎవరు కావాలి" అంది.

జయకృష్ణ నివ్వెరపోయాడు.

'నువ్వే, బృందా! నువ్వే. నీ కోసమే వెతుక్కొని వచ్చాను.' అరవాలనిపించింది జయకృష్ణకు. కాని "ఇక్కడికే వచ్చాను" అన్నాడు చివరికి.

"వారు ఇంకా రాలేదు. లోపలికి వచ్చి కూర్చోండి" అని ఇంట్లోకి దారితీసింది ఆమె. పాప "రండి" లనేసి ఆమె వెనకే పరుగుతీసింది.

జయకృష్ణకు ఏమీ కనిపించడం లేదు. అతడి కళ్లల్లో నిలిచిన కన్నీటిబిందువుల్లో దీపాలు ప్రతిఫలి స్తున్నాయి.

'బృందా! నన్ను గుర్తు పట్టలేదా? బృందా... నా పిచ్చిగాని మువ్వు నన్ను గుర్తు పట్టకపోవడమేమిటి? ఎన్నో సంవత్సరాలకు కనబడేటప్పటికి కోపం వచ్చిందా, బృందా?. . .'

ఆ నాటి బృంద, ఈ నాటి బృంద ఒకరే! తనూ

జయకృష్ణే! మరి?

కుర్చీ చూపించిన ఆమె కళ్లలోకి చూశాడు సూటుకేసు బల్లమీద పెడుతూ.

ఆ కళ్ళు ఏమీ తెలీనట్లు ప్రశాంతంగా ఉన్నాయి. ఆ ఇంటివెలుగు ఆ కళ్లల్లో ప్రతిఫలిస్తూందంతే.

ఆమె లోపలికి వెళ్లబోయింది.

జయకృష్ణ ఇక ఉండబట్టలేకపోయాడు.

"బృందావనీ!" అరిచాడు.

ఆమె బిత్తరపోయింది!

అతడి కళ్లల్లో దాక్కున్న కన్నీళ్ళు ఇక ఆగలేదు. అవి ఎన్నో సంవత్సరాలకు కలుసుకొన్నందుకు మనసు ఆనందంతో చిలికిన బాష్పాలు అయిఉండేవి. ఆమె 'జయా! వచ్చావా!' అని ఉంటే. కాని ఇప్పు డా కన్నీళ్లకు అర్థమే మారిపోయింది!

ఆమెకు ఏమీ అర్థంకాలేదు. తన పేరుపెట్టి పిలిచేటప్పటికి ఆమె మనసులో ఒక్క క్షణం ఏదో స్మృతిరేఖ కదిలింది. కాని అది ఎంతోసేపు నిలవలేదు. అతన్ని చూస్తుంటే...

"క్షమించండి. మీరెవరో ..." ఆమె ఇంకా పూర్తిచేయలేదు.

'బృందా!. . . జయా. . . నువ్వు. . . అని పిలిచే నీవు 'మీరు' అనేంతవరకూ ఎదిగిపోయావా?' జయకృష్ణ సుడులు తిరుగుతున్న మనస్సు అంది.

"నేను. జయకృష్ణను... బృందావనీ! నీ ధోరణి చూస్తుంటే నా కేమిటో అయోమయంగా ఉంది. . ."

బృందావని మాట్లాడలేదు.

"నన్ను జయా అని, కృష్ణా అని ఆప్యాయంగా పిలిచి అంతగా అభిమానించిన నా బృందావనికి, నా ఆత్మీయురాలికి నన్ను నేను పరిచయం చేసుకోవలిసిన ఈ క్షణం ఎంత చేదుగా ఉందో తెలుసా, బృందా!" జయకృష్ణ అంటున్నాడు.

ఆమె తల ఎత్తి చూసింది.

వీథిలోకి వెళ్లి వచ్చిన పాప "అమ్మా! దీపం ఆరిపోతుంది. . ." అంది.

"ప్రమిదలో కొంచెం నూనె పోయవే. . ." అన్న తల్లి దగ్గిరికి వచ్చి, "ఎవరమ్మా?" అంది నెమ్మదిగా పాప.

"నా కోసం. . ." ఆమె చెప్పింది.

జయకృష్ణ విన్నాడు...'బృందావని మారిపోయిందా?' అతడి మనస్సు మూలుగుతూంది. మనస్సులోని ఆరాటం, ఆవేదన అతడిలో మౌనాన్ని చంపేస్తున్నాయి.

"ఇంత దూరం వచ్చి, నా బృంద నన్ను గుర్తుపట్టలేకపోయిందన్న వేదనతో వెళ్లిపోనా? నీవు నన్ను మర్చిపోయావని ఎప్పటికీ అనుకోను. . . ఏ కారణాన నన్ను 'జయా' అని పిలవలేకపోతున్నావో నాకు అర్థం కావడంలేదు. . . ఈ కళ్లల్లో నీవు వెలిగించిన స్నేహపుదీపం ఆరిపోనంతవరకూ నిన్ను నేను మరిచిపోనని నీ అంతరాత్మకు తెలుసు. ఆరీఆరని దీపపు వెలుగులో నిలబడ్డ నేను ఎంత దురదృష్టవంతుణ్నో, బృందా!" అతడిలో వ్యథను చూసీ బృందావని ఏమీ అనలేదు.

"ఈ కళ్లల్లోకి చూడు, బృందా! అవి గుడ్డివి అయిపోయాయో. . . చూడు. . . లేక నీవు ఆత్మీయతతో వెలిగించిన దీపాలు మసిగట్టుకుపోయాయో, ఇంకా ఆరకుండా ఆ వెలుగులో నీ కోసం వెతుక్కొంటూ వచ్చాయో చూడు..." జయకృష్ణ అంటున్నాడు.

**కంటిముందు రగిలిన మంటలు నేడుకాకుంటే రేపైనా చల్లారిపోతాయి. కాని గుండెలోపల రగిలిన మంటలు కాలక్రమాన మరీ ఎక్కువవుతాయి. ఆ మంటలలో కాలిన ప్రేమ, బంగారం వలె వన్నె, విలువ పెంచుకుంటుంది.**

---

అంతక్రితం రెండు రోజులూ కురిసిన వానకు వరదై పారుతున్న మూసీగట్టున నిలబడ్డాడు జయకృష్ణ.

సాయంత్రపు ఎండ అలపై బడి వెలుగు జిమ్ముతూంది. . .

బృందావని అటే వచ్చింది.

జయకృష్ణను చూసి "పరవళ్లు త్రొక్కుతున్న మూసీతో ఏమో మాట్లాడుతున్నట్లున్నారే!. . ." అని నవ్వింది బృందావని.

జయకృష్ణ వెనక్కి తిరిగి, బృందావనిని చూసి ఏమీ మాట్లాడలేదు.

"ఇలా ఒక్కరే వచ్చారే!. . ." ఆమె మళ్లీ అడగబోయింది:

జయకృష్ణ తలఎత్తి చూసేటప్పటికి మధ్యలోనే ఆగి, మళ్లీ అంది.

"మరేం లేదు. . . ఏ స్నేహితుడో, ఎవరో వెంట లేరేమిటి?"

"నాకు చెప్పుకోదగ్గ స్నేహితులు ఇక్కడ ఇంకా దొరకలేదు. ఉన్న ఇద్దరూ చెరొక మూలా ఉన్నారు" అన్నాడు జయకృష్ణ.

"అంత మూగగా ఉంటే ఎలా వస్తారు, మనుష్యులు దగ్గిరికి?"

"అయితే పైపైకి మాట్లాడే వాళ్లందరూ స్నేహితు లవుతారా?" అని జయకృష్ణ అనేటప్పటికి బృందావని క్షణం మాట్లాడలేదు.

"అయితే ఇక్కడ ఎవరూ స్నేహితుడిలా కనబడలేదన్నమాట!. . ." నవ్వింది బృందావని.

"ఇప్పటివరకూ అంతే. . . కాని ఇప్పుడిప్పుడే ఒకరిలో నేను ఆశించే స్నేహాన్ని చూడగలననుకొంటున్నాను. . ." అన్నాడు జయకృష్ణ.

"ఎవరు. . .?" వెంటనే అడిగింది బృందావని.

"బృందావని. . ." అన్నాడు జయకృష్ణ.

బృందావని ఆశ్చర్యపోలేదు. జయకృష్ణ మళ్లీ అన్నాడు:

"నే నింతవరకూ ఏ స్త్రీతోనూ ఇలా మాట్లాడలేదు. . . ఇప్పుడు మాట్లాడుతున్నానంటే ఈ బృంద అంటే ఇష్టం ఏర్పరుచుకున్నందుకే. . ."

"మీరు ఆశించిన స్నేహం నాలో చూడగలనని ఎలా అనుకొన్నారు?"

"నీవు మనసున్నదానివి కాబట్టి!"

"మరి. . . మీరు మా ఆఫీసుకు వచ్చి ఆరు నెలలయింది కదా. ఒక్కసారి మాట్లాడలే దెందుకు?"

"నిన్ను పూర్తిగా చదివేటప్పటికి ఇంతకాలం పట్టింది."

"ఏం చదివారు?"

---

# సయనారా

---

"స్నేహధర్మంలో దేనికీ విసుదీయవని, విమర్శిస్తే చిరునవ్వుతో అంగీకరించి, ఆలోచించి మంచి చెడులను చెప్పగలదానివని, గాలి వీస్తే ఆరిపోయే దీపంలాంటి స్నేహత్వం నీలో లేదని."

బృందావని అంది: "అయితే నువ్వు నా స్నేహితుడివి, జయా!"

"జయా!" అని ఆమె పిలిచినప్పుడు ఎంతో ఆత్మీయంగా పిలిచిం దనిపించింది జయకృష్ణకు.

"మరి ఆఫీసులో అంతగా అందరితోనూ మాట్లాడుతుంటాను కదా, మీరు ఏమనుకొన్నారు?"

"నీలో చిలిపితనాన్ని చూస్తుంటాను. . . అంతే..."

"మరి, ఆ చిలిపితనాన్ని కొందరు విపరీతంగా చెప్పుకొంటుంటారు. . ." ఆమె కళ్లల్లో నీళ్ళు నిలిచాయి.

"అలాంటివి నీవు గాలికే వదిలి వేస్తావు. నీలో ఆత్మస్థైర్యం ఉంది. 'మనం మంచిగా ఉన్నంతవరకూ మనకేం' అన్న తత్త్వం నీది."

"నన్ను పూర్తిగా అర్థం చేసుకున్నావు. ఇంతగా అర్థం చేసుకొన్నది నీ వొక్కడివే."

"నన్ను స్నేహితుడివిగా అంగీకరించావు. నీ సుఖదుఃఖాల్లో నే నుంటాను. తెలిసిందా?. . ."

"కాదని ఎలా అనగలను?. . . ఇక చీకటి పడుతుంది, వెళదామా?. . ."

"ఒక్కదానివే వచ్చావు. . ." నవ్వాడు జయకృష్ణ.

"అక్కయ్య, అమ్మవాళ్లు ఎవరింటికో వెళితేనూ, ఇలా తెలిసి నామె ఇంటికి వచ్చి, వచ్చాను... అయినా నేను ధైర్యంగలదాన్నని నీకు తెలుసుగా. . ." నవ్వేసింది బృందావని. గలగల నవ్వు అలల సరిగమల్లో కలిసిపోయింది.

"పోదాం, పదండి. . ." దారితీసింది బృందావని.

జయకృష్ణ మొదటిసారిగా బృందావనితో బస్సులో ఎక్కి కూర్చున్నాడు.

ఆరోజు తన డైరీలో ఒక తీయని స్మృతిని వ్రాసుకొన్నాడు జయకృష్ణ.

ఇంటికి వెళ్లాక బృందావని జయకృష్ణని గురించి చెప్పింది, తనతో ఎక్కువ ప్రేమగా మాట్లాడే అక్కకి.

"బృందా! నీవు నమ్మిన మనసు ఎటువంటిదో నాకు తెలుసు. నీ మనసు నాకు తెలుసు. నీవు వెలిగించిన ఈ దీపాన్ని ఆరిపోకుండా చూసుకో. ఆ స్నేహపుదీపం జీవితానికి వెలుగై నిలుస్తుంది. . ." అంది ఆమె అక్క.

ఒకరోజు మధ్యాహ్నం లంచ్ సమయంలో "బృంద పెళ్లి చేసుకోబోతూంది. . ." అని ఆకతాయి రాధ అనేటప్పటికి నలుగురూ బృందా, రాధల చుట్టూ చేరారు.

బృందావని చురచురా చూసింది రాధవంక.

"తప్పేముంది?. . ." నవ్వేసింది సహోద్యోగిని.

"ఈ శుభవార్త విన్నందుకు. . ." నలుగురూ ముందే అభివందనలు చెబుతున్నట్లు నవ్వారు.

"మరి బృందాదేవిగారి పెళ్లికి మనం ఏమేమి బహుమతులు ఇవ్వాలి?"

బృందావని చిరుకోపాన్ని గమనించనట్లే నటిస్తూ, ఎవరికి తోచింది వాళ్ళు చెప్పారు.

జయకృష్ణ ఏమీ మాట్లాడలేదు. అతడి మౌనాన్ని చూసి, రాధ దగ్గిరికి వచ్చి అంది: "మీరేం చెప్పారు కాదు, బృందాదేవికి బహుమతి. . .?"

ఆశోక
ఆంగ్లేయబోధిని

చిన్నలకు, పెద్దలకు ఉపయోగకరము. అక్షరాభ్యాసము రానివారు కూడా మా ఆంగ్లేయ బోధిని సహాయంతో 60 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును. బాలబాలికలకు చాలా సహాయపడును. మా ఆంగ్లేయబోధినిలో ఇంగ్లీషుకు ఉచ్చారణ పలుకురీతి తెలుగులో వ్రాయబడి యున్నది. దీనిలో ఇంగ్లీషుకు తెలుగులో గ్రామరు, వ్యాసములు, ఉత్తరములు వ్రాయుట, సామెతలు, కథలు మున్నగు విషయములు చక్కగా సులభశైలిలో యున్నవి. సుమారు 600 పేజీలు గల పుస్తకము వెల రూ. 6—00. పోస్టేజి అదనం. వలయువారు :

టాగూర్ పబ్లిషింగ్ హౌస్,
20, వైశ్య హాస్టల్ బిల్డింగ్, హైదరాబాద్—27.

SWASTIK

వాణిజ్య ప్రకటనలకు
లోక్ సత్తా
ఉత్తమ సాధనం

వాయిదాలమీద ట్రాన్సిస్టర్



రు. 285/- ఖరీదయే ప్రపంచ ప్రసిద్ధమైన నేషనల్ డీలక్స్ 3 బాండ్ల అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను రు. 10/—ల నెలసరి వాయిదాల మీద తెప్పించుకోనండి. ప్రతిపల్లెకు, బస్తీకి పంపవచ్చును. వ్రాయండి.

IMPEX INDIA (WAP)
P.B. 1045, DELHI-6.




బయో-సాల్
(గ్రైప్ మిక్శ్చర్)

అండ్ జె. డి షేన్
హైదరాబాద్-ఇండియా

"బహుమతి ఏమిటి? ఏమీ లేదు. . ." జయకృష్ణ అనేటప్పటికి, నలుగురూ "ఊఁ!. . ." అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

బృందావని అతడి కళ్ళల్లోకి చూసి తృప్తిగా నవ్వుకొంది.

సాయంత్రం బృందావనీ, జయకృష్ణలు బయటకు వస్తున్నారు.

"ఇంతేనా. . . ఎంత ప్రాణస్నేహితులు! పెళ్ళికి బహుమతి ఇవ్వడట!"

"వేరే బహుమతి ఎందుకోయ్? మనస్సే ఇచ్చాడేమో, ఎదలో దాచుకొమ్మని! . ." అన్న మాటలు వినిపించాయి.

టాంక్‌బండ్‌మీద నడుస్తున్నప్పుడు అన్నాడు జయకృష్ణ: "బృందా! వాళ్ళమాటలు విన్నావు కదూ. . . నా వల్ల నీవు ఇలాంటి మాటలు వినవలసి వచ్చింది."

"జయా! పిచ్చివాళ్ళు ఏదో అంటారు. అంత మాత్రాన మనం బాధపడితే ఎలా?" అని బృందావని అనేటప్పటికి 'నువ్వు అందరిలాంటిదానివి కాదు' అనుకొన్నాడు జయకృష్ణ.

"అయితే, నా పెళ్ళికి నీవు బహుమతి ఏదీ ఇవ్వవన్న మాట!" నవ్వేస్తూ అంది బృంద.

"ఇవ్వను. ఎవరెవరో ఇచ్చే బహుమతుల్లో కలిసిపోయే బహుమతి నేను ఇవ్వను. నా కిష్టం లేదు. నేను ఏమీ ఇవ్వకపోతే నీవు ఏమీ అనుకోవు అని నాకు తెలుసు, బృందా!"

"జయా!. . ." స్నేహపూర్వకంగా చూసింది అతడి కళ్ళల్లోకి.

"బృందా! అయితే, నీవు పెళ్ళి చేసుకొంటున్నావా? మరి నాకు చెప్పలేదే. . ." విస్మయాన్ని తెచ్చిపెట్టుకొని అన్నాడు.

"ఇప్పట్లో అదేం లేదు." నవ్వేసింది బృందావని.

"మరి మధ్యాహ్నం?. . ."

"జయా! నీకు చెప్పకుండా మరెవరికి చెబుతాను? ఆ రాధే పెళ్ళి చేసుకోబోతూంది. ఆ విషయం నాతో చెప్పి, 'మరి నీ పెళ్ళెప్పుడే' అంది. 'జరిగినప్పుడే' అని నేనంటే పెద్ద తమాషా చేసిపారేసింది. అంతకు తప్ప మరేం లేదు. . ."

"బృందా! ఎప్పటికైనా పెళ్ళి చేసుకోవలసిందేగా. పెళ్ళి అయ్యాక నన్ను మరిచిపోతావా?"

"మరిచిపోతాను. . ."

"బృందా!" పిచ్చిగా అరిచాడు జయకృష్ణ.

"ఎందు కలా అరుస్తావు? స్నేహం చచ్చిపోతుంది అని నీ వనుకొంటే నేను నిన్నుకాని, నన్ను నీవుకాని మరిచిపోవడంలో ఆశ్చర్యం ఏం ఉంది?" బరువుగా అంది.

"బృందా! నేను ఏదో తమాషాగా అంటే నీ విలా బాధపడతావనుకోలేదు. తా వెలిగించిన దీపం ఎవరైనా ఆర్పేస్తారా?" అనునయంగా అన్నాడు జయకృష్ణ.

"జయా! ఇకనుండి నీతో మాట్లాడను. . ." అంది బృందావని ఉన్నట్టుండి ఒక రోజు.

"నిజంగా. . ." అంతలోనే ఎంతగానో బాధపడిపోయాడు జయకృష్ణ.

"నిజంగానే. . ." ఇంకా బృందావని అంటూనే ఉంది.

"అయితే నేను ఓడిపోయానన్న మాట! ఓడిపోయాను, బృందావనీ. . ."

"ఎందుకూ?" చిత్రంగా చూసింది.

"ఎందుకా?. . . నేను ఎవ్వరితోనూ అంత త్వరగా స్నేహం చేయలేను. . . నా మనసుకు నచ్చేంతవరకూ ఎవరినీ దగ్గిరగా భావించుకోలేను. నిన్ను అర్థం చేసుకొన్నాననుకొన్నాను. ఒక ఆత్మీయురాలు దొరికిం దని సంతోషించాను. ఒక స్త్రీని నేస్తంగా భావించడంలో ఇదే మొదటిసారి. ఆ నేస్తం మరీచిమనుతో వెలిగే దీపపుకాంతిలో ఆడుకొంటున్నాననుకొన్నాను. కాని, ఇప్పుడు నీవు నా నుండి దూరంగా వెళ్లిపోతానంటుంటే నేను ఓడిపోవడం కాదూ!" బాధగా అన్నాడు జయకృష్ణ.

"జయా! నీవు ఇంత అమాయకుడ వనుకోలేదు. నేను నిన్ను దూరాలా ఉంచుతానా? నీవే నన్ను దూరంగా భావిస్తున్నావు. . ." బృందావని బాధ పడుతూ అంది.

"నేనా? నేనా, బృందావనీ!" ఆశ్చర్యంగా చూశాడు.

"ఏదీ మళ్లీ అను. . ." అన్నాడు.

"కాదా, జయా! నీవు ఎప్పుడైనా మా ఇంటికి వచ్చావా? ఎన్నిసార్లు రమ్మన్నా, 'వస్తాలే, వస్తాలే' అంటావే కాని, వచ్చావా? 'ఏదీ, నేస్తం?' అని ఇంట్లో వాళ్లు అడిగినప్పుడు నేనేం చెప్పను, జయా? మా ఇంటికి రావడానికి నీ వెందుకు ఇష్టపడటం లేదు! ఇలా మా ఇంటిని, నన్ను దూరం చేయడంలేదూ? ఏం, చెప్పు, జయా! నీకు ఆడదానికన్న చచ్చేంత సిగ్గు అని సరిపెట్టుకోనా! ఇంతకాలం అయిపోయినా నీలో సిగ్గు పడే పిరికితనాన్ని పోగొట్టలేకపోయానా?"

జయకృష్ణ మనస్సు తేలిక పడ్డది. నవ్వేస్తూ అన్నాడు: "ఇంతేనా, ఏదో అనుకొని ఊరికే భయపడి పోయాను. బలేదానివే, బృందావనీ!"

"మరి, రేపు దీపావళి పండుగ కదా! మా ఇంటికి రావాలి, సరేనా!"

"నేను రాలేను. . ." అని జయకృష్ణ అనేటప్పటికి బృందావని కోపంగా అంది:

"[illegible]. అసలు ను వ్వెవరవంటా మా ఇంటికి [illegible]"

"బృందా! ఈ ఊరు వదిలి వెళ్లేలోగా తప్పకుండా మీ ఇంటికి వస్తానని నీ కెన్నిసార్లు చెప్పలేదు? నా మాట మీరి నే నెప్పుడూ పోను అని నీకు తెలును. . ."

"ఈ ఊరు వదిలి వెళ్లిపోతావా? జయా. . . వెళ్లిపోతావా!" జయకృష్ణ వెళ్లిపోతాడని అనుకోనే టప్పటికి అసలు విషయం అటుంచింది. . .

"ఉద్యోగం చేసుకొనేవాణ్ణి! ఎంతకాలం అని ఒకే ఊర్లో ఉంటాం? ఎప్పుడన్నా వెళ్లిపోవలసిందేగా. . ."

"అవుననుకో. . ." అంది ఎటో చూస్తూ బృందావని.

"ఆమాట కొస్తే నీవూ పెళ్లి చేసుకొని వెళ్లి పోవూ. . ."

"మనం విడిపోతాం. నీవు వెళ్లిపోతావు, నేను వెళ్లిపోతాను. . ." పిచ్చిగా చూసింది బృందావని.

"ఎందు కలా బాధ పడిపోతావు, బృందా? ఎవరి జీవితాలు వాళ్లకి ఏర్పడ్డాక, ఒకేచోట ఉండడం సాధ్యపడకపోవచ్చు. జీవనధర్మం పాటించడం తప్పదుగా, బృందా!"

"జయా! నా కెందుకో ఏడుపు వస్తుంది. మనం విడిపోతామూ?"

"నవ్విన మనసు ఎప్పుడూ నవ్వుతుందా? కొంత సేపన్నా మౌనంగానే ఉంటుంది. ఇక్కడ విడిపోతాం అంటే ఒకే ప్రదేశంలో ఉండం అన్న మాటే గాని, మానసికంగా అది సాధ్యం అవదు, బృందా! మనం వెలిగించుకున్న స్నేహపుదీపం కాంతిలో ఒకళ్ల దగ్గిర ఒకళ్లం ఎప్పుడూ ఉంటాం. . ."


బృందావని బరువుగా నిట్టూర్చింది.

బృందావని ఎక్కువగా బాధ పడిపోవడం చూడలేక పోయాడు జయకృష్ణ. ఆమెను నవ్వించాలని, ఊరడించా లని "సరే పద, బృందా, మీ ఇంటికి. ఈ రోజే వస్తున్నాను. . ." అన్నాడు.

"నిజంగా. . ." అంది. ఆమెలో కాస్త వెలుగు వచ్చింది. కాని అంతలోనే, "నీవు వెళ్లిపోయే రోజు వచ్చేస్తుందా?" అంది.

"ఆరోజు ఇప్పట్లో రాకూడదనే నా ఆశ."

"మనం ఆశిద్దాం. . . అంతే..." బృందావని అంది.



పేరంటానికి పిలుపు

చిత్రం— మారేమండ శ్రీనివాసరావు (గుంటూరు-2)

ఆరోజు సాయంత్రం బృందావనితో ఆమె ఇంట్లోకి అడుగుపెట్టిన జయకృష్ణ ఆడదాని సిగ్గును మించిన సిగ్గునీడలో ఉండిపోయాడు. బృందావని ఇంట్లోవాళ్లను పరిచయం చేస్తుంటే, వాళ్లు అడుగుతున్నదానికి జవాబు చెప్పడంలో పడ్డ తడబాటును చూసి బృంద ఫక్కున నవ్వింది. బృందావని అలా నవ్వడంలో అతడికి అంత వింత అనిపించలేదు. అలవాటు అయిన నవ్వు. చిలిపినవ్వు. అమాయికపు నవ్వు! తన్ను చూసి నవ్విన నవ్వులో స్నేహం విరిసిన పువ్వులను ఏరుకోవడం జయకృష్ణకు ఇష్టం.

ఇల్లంతా చూపి, సందడిగా, సరదాగా అవీ ఇవీ చెబుతూ డాబామీకి తీసుకువెళ్లింది. నీలాకాశంలోకి చూస్తూ పిలిచాడు జయకృష్ణ: "బృందా!. . ."

"అబ్బ! ఇప్పటికి ఈ మౌనం, సిగ్గుల మబ్బులు విడిపోయా యన్నమాట!" బృంద పరిగెడుతున్న వెండి మబ్బులను చూస్తూ అంది.

జయకృష్ణ నిండుగా నవ్వాడు.

బృంద క్రిందకు వెళ్లి, మళ్లీ వచ్చేటప్పటికి జయకృష్ణ ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. లీలగా అతడి కళ్లల్లో కదులుతున్న నీటితెరలను చూసిన బృందావనికి ఏమీ అర్థంకాలేదు.

"జయా! మాట్లాడవే. . . మా ఇల్లు ఎలా ఉంది?" అంటున్న బృందావనికి ఏమీ చెప్పలేక పోయాడు. అతడి ముభావాన్ని సహించలేకపోయింది బృంద.

"అలా ఆకాశంలోకి చూస్తూ ఎంతసేపు కూర్చుంటావు? ఏమిటి ఆలోచిస్తున్నావు? చెప్పు, జయా!"

"చెప్పనా. . .? నాకు ఉన్న ఒక్కగానొక్క స్నేహితుడి ఇంటికి మొదటిసారిగా వెళ్లిన క్షణం గుర్తుకు వచ్చింది. ఆ గడిచిపోయిన క్షణానికి, ఈ క్షణానికి ఎంత దగ్గిర సంబంధం ఉందా అని. నా స్నేహితుణ్ణి గురించి చెబుతూండేవాడిని కదూ. . . నేను ఇన్ని రోజులు మీ ఇంటికి రాకపోవడానికి కారణం చెప్పనా?. . ."

బృందావని ఆశ్చర్యపోయింది, 'తన ఇంటికి రాకపోవ డానికి కారణం ఉందా' అని. "చెప్పు, జయా! నువ్వు ఇన్ని రోజులు ఒక విషయాన్ని దాచావన్నమాట! మా ఇంటికి రాకపోవడానికి కారణమూ ఉందన్న మాట!" సగం నిష్ఠూరంగానూ అంది.

"నేను చెప్పింది వింటే నవ్విపోతారు ఎవరైనా. అతడు స్నేహితుడు! మమతానుబంధాలకు దూరమై పోయిన నేను స్నేహబంధంలోనే ఆత్మీయతను వెతుక్కుంటాను. అతడి ఇంటికి వెళ్లిన మొదటి క్షణం ఎటువంటిదో మరి, మనస్సు ఎప్పుడు, ఏ విధమైన ఉద్వేగానికి లోనైనా అతడి దగ్గిరికి వెళ్లి చెప్పేవరకూ ఉండలేకపోయేవాణ్ణి. అతడి దగ్గిరికి వెళ్ల డానికి సమయాసమయాలు చూడను. ఆ రోజు. . . అతణ్ణి విడిచివచ్చే రోజు...రోజంతా మాట్లాడుకొన్నా రాత్రి నిద్ర పట్టలేదు. మరునాడు తెల్లవారుఝామున రైలెక్కాలి. ఇంకా ఏమో చెప్పాలని ఆరాటం. ఆ రాత్రి ఊరు నిద్రపోతున్నవేళ, వెళ్లి పడుకొన్నవాడిని లేపి, 'నేను వెళ్లిపోతున్నాను' అన్నాను, ఇంకేమీ చెప్పలేక. ఆ క్షణంలో వీథిలో గుడ్డిగా వెలిగే దీపపు కాంతి. . . ఇవే కళ్లల్లో నిండిన నీళ్లల్లో పడి ఏం సందేశాన్ని ఇచ్చిందో మరి!. . . ఇవ్వాళ నీ ఇంటికి వచ్చాను. ఇక నాలో ఆ బలహీనత విజృంభిస్తుంది. ఆ బలహీనతను జయించే శక్తి నాకు లేదు, బృందా! కాస్త ఆనందం కలిగినా, దుఃఖం కలిగినా నేను నమ్మిన మనసుకు చెప్పేవరకూ ఉండలేను. ఇవ్వాళ నీ ఇంటికి వచ్చానంటే ఇకముందు, ఏ క్షణంలో అయినా, ఎప్పుడు హృదయం స్పందించినా, ఇక్కడ ఉన్న ఒక్కగానొక్క ఆత్మీయురాలైన నీ దగ్గిరికి రాకుండా ఉండలేను. ఇది బలహీనత అను, ఏమన్నా అను. నాకు దాన్ని అధిగమించే శక్తి లేదు. . . బృందా! మీ ఇంటికి రానంతవరకూ. . . ఇంకా మొదటిసారి వెళ్లలేదు కదా అని అనుకొనేవాడిని... అందుకే ఈ ఊరు వదిలి వెళ్లిపోయేటప్పుడు వస్తాను అని చెప్పేవాణ్ణి."

"జయా! నేను ఏమో అనుకొన్నాను. నన్ను ఇంత దూరంగా ఉంచావా?" అంతా విని బృందావని నిట్టూర్చింది.

"బృందావనీ! నిన్ను దూరంగా ఉంచానా?. . ." జయకృష్ణ గొంతు జీరవోయింది.

"కాదా మరి? ఒకప్పుడు ఏమన్నావు? నీ సుఖదుఃఖాలలో నే నుంటాను అన్నావే. మరి, నీ ఆనందం, నీ వేదన నాకు కావా? నా ఇంటికి నీకు ఇష్టమైనప్పుడల్లా రావద్దంటానా?" అంది బాధగా.

"పిచ్చి బృందా! నువ్వు అలాంటిదానివైతే నిన్ను 'బృందా' అని పిలిచేవాడినా?" తేరుకున్న మనస్సుతో అన్నాడు జయకృష్ణ.

"నీవు ఈ ఇంటికి రావడానికి ఏ క్షణంలోనూ సంకోచించవద్దు. . . తెలిసిందా?"

"సరే. . . కాని ఈ ప్రపంచంలో మనం ఇద్దరమే ఉండటం లేదు. రంగారావులాంటి వాళ్ళు కూడుకొన్న లోకం ఉంది. . ."

"మనం మంచిగా ఉన్నంతవరకూ. . ." బృందావని అంటున్నది.

"బృందా! ఈ లోకంలో మంచివాళ్ళు ఒకళ్ళే లేరు. . . వెండిమబ్బులు, ఎర్రనిమబ్బులు ఉన్నాయి!"

బృందావని తల్లి లక్కడకు వచ్చి, వాళ్ళ మాటలను వింటున్నప్పుడు, తృప్తిగా నవ్వుతూంది!

ఆ రోజున. . . జయకృష్ణ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల్లో క్లాస్ వన్ ఆఫీసర్‌గా ఎన్నిక అయినట్టు వార్త వచ్చిన రోజున. . . బృందావని ఆఫీసుకు రాలేదు.

జయకృష్ణ అందరి నవ్వులను చూశాడు. బృందావని లేకపోయేటప్పటికి ఏదోలా అనిపించింది. సాయంత్రం అవగానే ఆమె ఇంటివైపు నడిచాడు.

బృందావనితో పరిచయం కాకపూర్వం ఆ పరీక్షకు కట్టాలని అనుకొనేవాడు జయకృష్ణ. తీరా అప్లికేషన్ పంపించే రోజులు వచ్చేటప్పటికి మునిభావంగా ఉండిపోయాడు. . . ముందు.

"పరీక్షకు కట్టావా?" అని అడిగిన బృందావనికి "లేదు" అని చెప్పాడు.

"ఆఖరి రోజులు దగ్గిర పడుతున్నాయిగా... త్వరగా పంపు. . ."

"అసలు పరీక్షకు వెళ్ళదలుచుకోలేదు. . ." నిర్లిప్తంగా అన్నాడు జయకృష్ణ.

"ఏం, ఏమైంది?. . ."

"ఏమీ కాలేదు."

"చెప్పడానికి ఇష్టం లేదా?. . ."

"అంత మాట అనకు. . ."

"మరి, చెప్పు. . . ఎందుకు కట్టడం లేదు?. . ."

"పరీక్షకు వెళ్ళాలనిపించడం లేదు. . ."

"జయా! నువ్వేదో పెద్ద ఆఫీసర్ అవుతావని. . . ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నాను. ఒక్కసారి ఆ ఉద్యోగాల్లో ప్రవేశించితే. . . నీ భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉంటుంది. నీ ఉన్నతిని లక్షించవద్దా, జయా! చెప్పు!"

"అదే నేనూ అడుగుతాను, బృందా! సగంలో మానివేసిన నీ డిగ్రీని ఎందుకు పూర్తిచేయవు?"

బృందావనికి జయకృష్ణ భావం అర్థమైంది. "జయా!" అని ఆత్మీయంగా పిలిచింది.

"అవును, బృందా! నువ్వు డిగ్రీ పూర్తి చేస్తానని ఎందుకు విరమించుకొన్నావు?"

"చెప్పాగా. . . ఇలా ఆఫీసు. . . ఇంట్లో పని. . . మా అమ్మకు అప్పుడప్పుడూ ఒంట్లో బాగోదు. మా అక్కలు, వాళ్ళ సమస్యలు. . . ఇవన్నీ పెట్టుకొని చదవలేను. . . అయినా ఆడదాన్ని. . . పెళ్ళి చేసుకొని వెళ్ళిపోవలసినదాన్ని. నేను చదివితే ఎంత, చదవకపోతే ఎంత?"

"నువ్వు అలా అంటే నేను ఒప్పుకోను. . . నువ్వు చదవాలి. . . అంతే."

"నీకు తెలీంది ఏముంది, జయా! నా ఆరోగ్యం అంత మంచిది కాదు. దాన్ని పాడుచేసుకొని చదివి ఏం సాధిస్తాను. . . చెప్పు, జయా. . ."

"వద్దు. . . వద్దు. . . నీ ఆరోగ్యం పాడుచేసుకొని చదవకు. వద్దు. . ." అని జయకృష్ణ అంటుంటే బృందావనికి అతని ఆరాటం అర్థమైంది. 'నీ హృదయ స్పందన నాకు వినిపిస్తుంది, జయా!' అనుకొంది.

"రేపు తప్పకుండా అప్లికేషన్ పంపు... తెలిసిందా," ఆజ్ఞాపించుతున్నట్లు అంది బృందావని.

"బృందాదేవిగారి ఆజ్ఞ!" నవ్వాడు జయకృష్ణ.

పరీక్షకు వెళ్ళడానికి కారకురాలైన బృందావనిని తలుచుకొంటూ, ఆమె ఇంటికి వచ్చాడు.

ఆమెకు ఆ వార్త చెపుదామని ఎంత ఉత్సాహంగా వచ్చాడో, అంత నిరుత్సాహపడిపోయాడు, జ్వరంతో ఉన్న బృందను చూసేటప్పటికి. ఆమెతో కొంచెం మాట్లాడి ఆ విషయాన్ని చెప్పాడు. . . ఆమె కళ్ళల్లో వెలుగు చూశాడు. ఆ వెలుగులో ఏవో నీడలు కదలాడుతున్నట్లు గమనించాడు.

"నువ్వు దూరం అయిపోయే రోజు వచ్చేసిందా, జయా!" అంది నెమ్మదిగా బృందావని, ఎంతో కష్టంమీద.

జయకృష్ణ ఇంక ఏమీ మాట్లాడలేకపోయాడు. అతడికి అంతవరకూ ఆ విషయం తట్టలేదు. "దూరం. . . దూరం. . . బృందా!" అతడి మనస్సు సుడులు పడుతూంది. . .

మరికొన్ని నెలలకే జయకృష్ణ విజయవాడ వెళ్ళిపోవలసి వచ్చింది!

విజయవాడ వచ్చిన మూడు నెలలకి దీపావళికి బృందావని దగ్గిరికి వెళ్ళి, పండక్కి చీర అదీ ఇచ్చి వచ్చాడు. . . బృంద వ్రాసే ఉత్తరాలు కృష్ణాతీరంలో కూర్చుని చదువుకోవడంలో ఏవో ఆనందాన్ని వెతుక్కొనేవాడు జయకృష్ణ.

కాని, మళ్ళీ దీపావళి వచ్చేముందు ఒక నెలనుండి బృందావనినుండి ఉత్తరాలు రాకపోయేటప్పటికి జయకృష్ణ మనసు మనస్సులో లేదు. 'మరి వారం రోజులలో దీపావళి వస్తుందికదా. అప్పుడు వెళ్దాం ...' అనుకొని దీపావళికోసం ఎదురుచూస్తూ ఉన్నాడు.

"బృందా! నీవు ఎలా ఉన్నావు?. . . ఎందుకు ఉత్తరం వ్రాయలేదు. . ." అని ఒకటే బాధపడిపోయాడు. . .

* * *

సాస వీథిలో నిలబడి మందుసామానులు విరజిమ్మే పువ్వులను చూస్తూంది.


## కావలెను

ప్రపంచ ప్రసిద్ధమైన మా జపాన్ మాడెల్ పాకెట్ ట్రాన్సిస్టర్‌కు ఆర్డర్లు



సేకరించుటకు నెలకు రు. 450/— ల మీద, లేక కమిషను మీద, ఇండియా అంతటా పూర్తి టైం/పార్టు టైం అభ్యర్థులు పురుషులు స్త్రీలు కావలెను. శాంపిల్ సెట్టుకు వ్రాయండి:

**Employment Officer (A.P.M.-88)**
**Box 1564, Delhi-6.**



## తెల్ల వెంట్రుక లుండవు

పొగడడం మాకు ఇష్టం లేదు. "Palitari" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నలగా మార్చును. మొదట తెల వానిని నల్లగా మార్చును. అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపక శక్తిని, కంటి చూపును వృద్ధి పరచును. లాభం పొందినవారు 1000 మంది పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 10/—

**Sri Krishna Chandra Vaidya**
**(A.V.H ) P.O. Katrisarai (Gaya)**



చిత్రకళను తెలుగు భాషలోనే నేర్చుకొనండి



స్థాపితం: 1957 ఫోన్ నెం: 82796

మా విద్యార్థి, K. T. నారాయణ గారు, కోటగడ్డ, ధర్మవరం తాలూకా ఇలా వ్రాయుచున్నారు. మీరు పంపు పాఠములు మిక్కిలి శ్రేష్ఠముగాను, తేటగాను యున్నందున కుతూహలముగా నేర్చుకొనవలెననెడి ఉత్సాహము కలుగుచున్నది.

మీరుకూడా ఇట్టి కుతూహలము కలిగించు చిత్రకళా విద్యను నేర్చుకొనుటకు ఇష్టపడుచున్నారా? తెలుగు, తమిళం, మళయాలం, ఇంగ్లీషు, గాగల మీరు కోరిన భాషలలో చదువ వచ్చును. వివరములకు 50 పై. స్టాంపులు పంపండి.

**SANTHANU'S CHITIRA VIDYALAYAM**
**C'o Chitirakullan, Madras-2.**

బృందావని "నువ్వు జయకృష్ణవా? నువ్వు జయవా?" అంటూంది.

"బృందా! ఇప్పటికైనా ఈ జయను గుర్తించావా?" అంటూ లేచిన జయకృష్ణకు ఎదురుగా కనబడింది అద్దం.

అంతే. . . ఆరిపోయా యనుకొన్న మంటలు ఉవ్వెత్తున లేచాయి. అవి స్పష్టంగా అద్దంలో కనిపిస్తున్నాయి. ఆ మంటల్లో జయకృష్ణకు కాలిపోతున్న డైరీలు, బృంద వ్రాసిన ఉత్తరాలు, ఇంకా వాటి వెనుక నవ్వుతూ రంగారావు...కృష్ణ అలలు...

అవి మంటలు!

. . . బృందను తలుచుకొంటూ కృష్ణవేణమ్మ గుండెల్లోకి చూస్తున్న జయకృష్ణకు ఒకనాడు హైదరాబాదునుండి వచ్చిన రంగారావు కనిపించాడు. అతడే చెప్పాడు, "బృందావని చచ్చిపోయి నెల అయింది. . ." అని.

జయకృష్ణ కృష్ణగుండెల్లో తల దాచుకోబోయాడు.

కాని రంగారావు పుణ్యం కట్టుకొన్నాడు.

దీపావళి వెళ్లిపోయింది. . .

రాత్రి ఇంటికి వచ్చాక డైరీలు, బృందావని వ్రాసిన ఉత్తరాలు ముందు వేసుకొని 'బృందా, బృందా!' అనుకొంటూ ఉన్మత్తస్థితిలో "నువ్వు వెళ్లిపోయాక ఇవి ఎందుకు. . . నే నెందుకు..." అని విస్ఫోటించాడు.

అవి కాలుతూ ఉన్నాయి. అవిగాక ఇంకా గదిలో కాగితాలు అంటుకొన్నాయి. పిచ్చిగా, "బృందా, చచ్చిపోయావా!" అంటూ నిరాశావాదిగా ఆ మంటల్లోకి చూస్తున్నాడు. ఆ పొగలు అతడి కళ్లల్లో నీళ్లు నిలిపాయి. తనకు ఏం జరుగుతుందో గ్రహించేటప్పటికి స్నేహపుదీపం ఆర్పేసి, దేవుడు పూసిన మసి ముఖం నిండా ఉంది.

ఎక్కడినుండో రంగారావు నవ్వు వినబడుతూంది!

తల్లి కొడుకును చూసి ఏడ్చింది!

ఏడిస్తేమటుకు. . . మంటల్లో మాడిపోయిన జయకృష్ణ ముఖం మళ్లీ వికసించదు!

ఆ తరవాత హైదరాబాదు పనిమీద వెళ్లినప్పుడు రాధ కనపడింది. జయకృష్ణను గుర్తు పట్టలేదు.

"ఎవరు మీరు. . ." అంది ఆమె.

"నేను... జయకృష్ణను. . ." చెప్పాడు. ఆమె నమ్మలేనట్టు చూసింది.

"కాలం పాడిన గీతంతో నే నిలా అయ్యాను..." ఇంకా ఏవో గుర్తులు చెప్పేటప్పటికి "ఎంత అన్యాయం జరిగిపోయింది?" అని నిట్టూర్చింది రాధ.

"నా బృంద చచ్చిపోయింది. . ." అంటున్నాడు జయకృష్ణ.

రాధ మధ్యలోనే అంది: "బృంద చచ్చిపోవడం ఏమిటి?. . . బృంద హాయిగా పెళ్లి చేసుకొని సుఖంగా ఉంది, విశాఖలో. దాని కో పాపకూడాను. . ." అని ఆమె అంటుంటే రంగారావు రగిల్చిన మంట స్వరూపం ఏమిటో అర్థమైంది.

ఏడు సంవత్సరాల తరవాత దీపావళి వెళ్లిపోయిన రెండు రోజులకు ఏనాడో దీపావళికి కొన్న చీరతో, సగం కాలిపోయిన డైరీ ఒకటే తీసుకొని విశాఖ వచ్చాడు, బృందావని దగ్గిరికి.

చచ్చిపోయిందనుకొన్న తన బృంద బ్రతికి ఉందని, తనను 'జయా!' అని పిలిచే బృంద దగ్గిరికి వచ్చానని, ఏడు సంవత్సరాల తరవాత తన ఆత్మీయురాలను చూస్తున్నానన్న ఆనందంలో, విచిత్రానుభూతిలో తనను బృందావని 'గుర్తు పట్టలేదు' అన్న విషయం మరిచిపోయాడు! ఆ విషయాన్ని అద్దంలో ప్రతిరూపం గుర్తు చేసేటప్పటికి జయకృష్ణ నిట్టూర్చాడు.

"బృందా!" అంటూ ఆమెవైపు తిరిగాడు.

కాని బృందావని కుర్చీలో మూర్ఛపోయి ఉంది!

వాళ్ల నాన్నను వెంటబెట్టుకొని ఇంట్లోకి వచ్చిన పాప తల్లిని, జయకృష్ణను చూపించింది.

పాప ఇంట్లోకి వెళ్లింది.

ఆయన ప్రశాంతంగా. . . కూతురు తెచ్చిన నీళ్ల ఆమె ముఖంమీద జల్లాడు.

అంతవరకూ మౌనంగా ఉండిపోయిన జయకృష్ణ అన్నాడు:

"నన్ను జయకృష్ణ అంటారు. ఆమెకు ఒకనాటి స్నేహితుడిని. . ."

"ఒకప్పటి స్నేహితు డంటారే. ఇప్పుడు కాదా..." ఆయన నవ్వాడు.

ఆ నవ్వులో ఆయనలోని ఉన్నత మానవత్వాన్ని చూశాడు జయకృష్ణ.

బృందావని కళ్లు తెరిచేటప్పటికి ఎదురుగా బల్లమీద జయకృష్ణ తెచ్చిన చీర, కాలిపోయిన డైరీ, భర్త, కూతురు, జయకృష్ణ కనిపించారు. బృందావని నీరసంగా నవ్వింది.

"జయా! నువ్వు చచ్చిపోయావన్నాడే రంగారావు..." మెమ్మదిగా అంది.

జయకృష్ణ ఆశ్చర్యపోలేదు. . .

కాని బృందావని భర్త ఆశ్చర్యపోయాడు, [illegible] విషయం ఇంతవరకు ఆమె చెప్పనందుకు. . . ★

# వేసవిలో ఒక రోజు

## డాక్టర్ తంగిరాల

సూర్యోదయం — తూర్పు దిక్కు ఎత్తిన ఎర్రని గొడుగు
పర్వత శిఖరాలకు చుట్టిన బంగారు తొడుగు
ప్రతి వస్తువు మీదా చల్లిన పసుపు నీళ్ల కిరణాలు
పక్షుల కిలకిలారావాలు ఆహారంకోసం పరవళ్ల ప్రయాణాలు

ఎండ — దురహంకారి కోపం దుర్వాసుని శాపం
భూమి బూరెల మూకుడు భానుడు భగ్గున మండుతున్న కొరకంచు
సలసల క్రాగే చమురు ఘర్మజలం
గలగల వేగే పొటెటో చిప్స్ సమస్త జనం

కొండలు కొలిమిలో పెట్టిన ఇనప గుండులు
కొండచిలువను త్రొక్కుతున్నట్టు మెత్తబడ్డ తార్రోడ్డు మీద నడకలు
పుడమి రౌడీ కాల్చే 'సన్ బ్రాండ్' సిగరెట్టు పొగలు
వీచే వేడిగాడ్పులూ తిరిగే సుడిగాలులూ . . . !

ఆపత్కాలంలో చేసిన సహాయం లాంటి చల్లని ఐస్ క్రీమ్!
అచ్చం సత్యవ్రతుని గుండెల వంటి కొబ్బరి 'గంగా బొండాలు'
మంచివాడి పెదవిపై చిటిలిన చిరునవ్వులు విచ్చిన మల్లె పువ్వులు . . .
మహాత్ముని ఆలోచనలు పుచ్చకాయ ముక్కలూ లంకదోసకాయ చెక్కలూ . . .

వేసవి కొలిమిలో కాల్చి కాల్చి సాగగొట్టబడ్డ తుప్పు కత్తి సాయంకాలం
వేడివేడి నిట్టూర్పులు విడుస్తున్న విరహిణులు మేడలూ మిద్దెలూ పాపం
పుండుమీద పూసిన ఆయింట్‌మెంట్ నెలరాజు . . .!
పొక్కిన నాలుక ఈ మండు వేసవి రోజు . . .!! ★